సాక్షి
అనకాపల్లి
శుక్రవారం । 25 । జూలై । 2025



ఒంటరి మహిళలే లక్ష్యంగా..

చైన్ స్నాచింగ్ ముఠాను అరెస్టు చేసి, 26 తులాల బంగారు నగలు, 3 ద్విచక్ర వాహనాలు, 3 సెల్‌ఫోన్ల స్వాధీనం చేసుకున్నారు. 8లో



అయ్యంకికి ఘన నివాళి

అల్లిపురం: గ్రంథాలయ ఉద్యమకారుడు అయ్యంకి వెంకట రమణయ్య జయంతి సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్‌రాజు నివాళులర్పించారు.



ప్రత్యంగిరా భద్రకాళి హోమం

సీతంపేట: విశాఖ లలితా పీఠంలో అమావాస్య సందర్భంగా గురువారం శ్రీప్రత్యంగిరా భద్రకాళి హోమం నిర్వహించారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి శ్రావణమాస పూజలు



స్వర్ణాభరణ అలంకరణలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ (విశాఖ): ఉత్తరాంధ్రుల ఇలవేల్పు కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం నుంచి వచ్చే నెల 23 వరకు శ్రావణమాసాన్ని పురస్కరించుకుని శ్రావణలక్ష్మి ప్రత్యేక కుంకుమ పూజలు జరపనున్నారు. ఈ ప్రత్యేక పూజలో సంకల్పం, లక్ష్మీ సహస్రనామాలు, లక్ష్మీ హోమం, అమ్మవారి దర్శనం, వేద ఆశీర్వచనం చేపట్టనున్నారు. విశిష్ట సామూహిక కుంకుమ పూజలో పాల్గొనదలిచే భక్తులు (దంపతులు) రూ.400 టికెట్ రుసుం చెల్లించాలి. పూజ అనంతరం భక్తులకు శేష వస్త్రంగా కండువా, జాకెట్టు ముక్క, పావుకేజీ పులిహోర, పావుకేజీ చక్కెర పొంగలి, శ్రీచక్ర యంత్రం (రాగి)ని మహాప్రసాదంగా అందజేస్తారు. శ్రావణమాసంలో వచ్చే మూడో శుక్రవారం (ఆగస్టు 8) వరలక్ష్మీవ్రతం, 9న శ్రావణ పౌర్ణమి రోజున ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అలాగే శ్రావణమాసంలో వచ్చే ఐదు శుక్రవారాలు (ఈ నెల 25, ఆగస్టు 1, 8, 15, 23) ప్రత్యేక పూజలు జరపనున్నారు.

పలు రైళ్ల రద్దు



తాటిచెట్లపాలెం (విశాఖ): తాడి–దువ్వాడ డౌన్ లైన్‌లో జరుగుతున్న నాన్ ఇంటర్ లాకింగ్ పనుల నిమిత్తం ఈ మార్గంలో నడిచే పలు రైళ్లు ఆయా తేదీల్లో రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. ఆగస్టు 26, 28, 30వ తేదీల్లో రాజమండ్రి–విశాఖపట్నం–రాజమండ్రి (67285/67286) మెము పాసింజర్, ఆగస్టు 26, 28, 30వ తేదీల్లో కాకినాడ–విశాఖపట్నం–కాకినాడ (17267/17268) ఎక్స్‌ప్రెస్, ఆగస్టు 26, 30వ తేదీల్లో గుంటూరు–విశాఖపట్నం–గుంటూరు(22876 / 22875) ఉదయ్ డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్, ఆగస్టు 26, 28, 30వ తేదీల్లో విజయవాడ–విశాఖపట్నం–విజయవాడ (12718/12717) రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ ఇరువైపులా రద్దు చేశారు.

'ఆది కర్మయోగి'తో గిరిజన ప్రాంతాల అభివృద్ధి

బీచ్‌రోడ్డు (విశాఖ): కేంద్ర ప్రభుత్వం గిరిజన ప్రాంత అభివృద్ధికి చేపట్టిన ఆది కర్మయోగి కార్యక్రమంలో అధికారులు ఆదికర్మ యోగులుగా ముఖ్య లక్ష్యాన్ని చేరుకోవాలని కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ కార్యదర్శి విభూ నాయర్ సూచించారు. గురువారం నగరంలోని ఓ హోటల్లో నాలుగు రోజుల కర్మయోగి రాష్ట్ర స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి, మాట్లాడారు. ప్రధానంగా గిరిజన గ్రామాభివృద్ధి దిశగా ప్రజల్లో చైతన్యం పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు పేర్కొన్నారు. శిక్షణ కార్యక్రమంలో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిల్లాల జిల్లా స్థాయి అధికారులు 28 మంది పాల్గొన్నారు. గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు ఎస్.భార్గవి కార్యక్రమ లక్ష్యాలు, అధికారుల విధులు, బాధ్యతలు వివరించారు. కార్యక్రమంలో నాలుగు జిల్లాల కలెక్టర్లు ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్నారు.

జీవీఎంసీ ఆస్తులు అన్యాక్రాంతం కాకూడదు



జీవీఎంసీ కమిషనర్, అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మేయర్ శ్రీనివాసరావు

దాబాగార్డెన్స్ (విశాఖ): జీవీఎంసీ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని మేయర్ పీలా శ్రీనివాసరావు జీవీఎంసీ పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. కమిషనర్ కేతన్ గార్గ్, చీఫ్ సిటీ ప్లానర్ ప్రభాకరరావుతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవీఎంసీ పరిధిలో జోనల్ వారీగా ఎన్ని ఖాళీ స్థలాలు, పార్కులున్నాయి, వాటిలో ఆక్రమణకు గురైన స్థలాలు, అన్ని జోన్లలో కలిపి 48 కోర్టు కేసులకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు వెంటనే తొలగించాలని ఆదేశించారు. అనంతరం జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ జీవీఎంసీ ఆస్తుల పరిరక్షణకు అధికారులు కృషి చేయాలన్నారు. రోడ్డు పక్కన ప్రభుత్వ స్థలం ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్న వారికి భారీ జరిమానాలు వేయాలన్నారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్లు మీనాకుమారి, ధనుంజయ్‌రెడ్డి, డీసీపీలు హరిదాసు, రామ్మోహన్, ఏసీపీలు, టీపీవోలు, ఇతర పట్టణ ప్రణాళిక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ ఆశలకు ఆనకట్ట



నీరు లేక అడుగంటిన వెర్రిగెడ్డ ఆనకట్ట గర్భం, (ఇన్‌సెట్) ప్రధాన గేట్ల లీకేజీ ద్వారా పోతున్న సాగునీరు

- వెర్రిగెడ్డపై ఆధారపడ్డ 5 వేల ఎకరాల ఆయకట్టు
- లీకేజీలతో కళ్ల ముందే నీరు వృథా కావడంతో అన్నదాతల ఆవేదన
- వర్షాలు కురిసినా నీరు నిల్వ ఉండని దుస్థితి
- అధికారుల నిర్లక్ష్యంతో సాగునీటి సరఫరా కష్టమే

నాతవరం: ప్రధాన గేట్ల లీకేజీతో సాగునీరు నిత్యం వృథాగా పోవడంతో వెర్రిగెడ్డ ఆనకట్టలో నీరు నిల్వ ఉండటం లేదు. స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో ఇంతటి నిర్లక్ష్యంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో మర్రిపాలెం పంచాయతీ శివారు పొట్టిపాలెం గ్రామ సమీపంలో వెర్రిగెడ్డ ఆనకట్ట ఉంది. ఈ ఆనకట్టపై ఆధారపడి ఖరీఫ్ సీజన్‌లో మర్రిపాలెం, వెన్నలపాలెం, డొంకాడ, బాపన్నపేట, మాదంపూడి, డి.యర్రవరం, ములగపూడి, యరకంపేట తదితర గ్రామాల పరిధిలో సుమారు 5 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. వెర్రిగెడ్డ ఆనకట్ట పరిధిలో పంట పొలాలకు నీరు ప్రవహించే ప్రధాన కాలువలకు ఇటీవల సిమెంట్ లైనింగ్ పనులు చేశారు. నెల రోజులుగా వెర్రిగెడ్డ ఆనకట్ట ప్రధాన గట్టును ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీలు మట్టితో పటిష్టం చేశారు. అయినా ఫలితం లేకపోయింది. వెర్రిగెడ్డ ఆనకట్ట ప్రధాన గేట్లు శిథిలం కావడంతో నీరు ఎప్పటికప్పుడే వృథాగా బయటకు పోతోంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వెర్రిగెడ్డలో నీరు చేరింది. ఖరీఫ్ పంట సాగుకు నీరు పుష్కలంగా ఉంటుందని ఆయకట్టు రైతులు ఆశతో ఎదురుచూస్తున్నారు. వెర్రిగెడ్డ ఆనకట్టలో ప్రస్తుత పరిస్థితి చూస్తే లీకేజీతో నీరు పోవడంతో నీటిమట్టం అడుగంటిపోయి కనిపిస్తోంది. కాలువలో ప్రవహించే లీకేజీ నీరు కొత్తవారు చూస్తే గేట్లు ఎత్తి నీరు ఆయకట్టుకు విడుదల చేసినట్లుగా ఉంది.



పంట కాలువలో ప్రవహిస్తున్న లీకేజీ నీరు

తాండవ ఉన్నా ఎర్రిగెడ్డే దిక్కు

నాతవరం మండలంలో తాండవ రిజర్వాయర్ ఉన్నప్పటికీ మర్రిపాలెం, డి.యర్రవరం పంచాయతీలతోపాటు ఎం.బెన్నవరం పంచాయతీలో రెండు గ్రామాలకు తాండవ నీరు ప్రవహించదు. ఈ గ్రామాలు తాండవ రిజర్వాయర్‌కు ఎత్తు ప్రాంతంలో ఉండటంతో వెర్రిగెడ్డ ఆనకట్ట నీటిపై ఆధారపడి ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు చేస్తుంటారు. ఈ ఏడాది వాతావరణం అనుకూలంగా ఉండి, వెర్రిగెడ్డ ఆనకట్టలో నీటిమట్టం బాగుంటుందని రైతులు ధీమాతో ఉన్నారు. వృథాగా పోతున్న నీటికి ఉపాధి కూలీలు మట్టితో తాత్కాలికంగా అడ్డుకట్ట వేశారు. భారీ వర్షం కురవడంతో ఆ మట్టి కొట్టుకుపోయి గేట్ల నుంచి మళ్లీ లీకేజీ మొదలైంది. ఈ విషయంపై నీటిపారుదల శాఖ జూనియర్ ఇంజినీర్ రవికిరణ్‌ను వివరణ కోరగా నిధులు లేక పనులు చేయలేదన్నారు. నాతవరం మండలంలో చిన్నతరహా సాగునీటి సంఘాలు 7 వరకు ఉన్నాయన్నారు. వాటికి మరమ్మతులు చేసేందుకు రూ.3 కోట్ల నిధులు అవసరమని ప్రతిపాదనలు చేశామన్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేసిన వెంటనే పనులు చేస్తామని చెప్పారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



కళ్ల ముందే వృథాగా పోతున్న వెర్రిగెడ్డ ఆనకట్టలో నీటి విషయంపై మూడు నెలల క్రితం అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో మరమ్మతు పనులు చేసి లీకేజీ నీటిని అరికడతామన్నారు. నేటికీ అక్కడ ఎలాంటి పనులు చేయలేదు. నెల రోజుల క్రితం రైతులంతా కలిసి నీరు పోకుండా మట్టి వేశాం.

–గొర్లె నాయుడుబాబు, డొంకాడ గ్రామం

ఖరీఫ్ సాగుకు నీరు కష్టమే



కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు చెప్పిన దానికి, ఇప్పుడు చేస్తున్నదానికి చాలా తేడా కన్పిస్తుంది. ఖరీఫ్ సాగుకు రైతు భరోసా పెట్టుబడి ఆర్థిక సాయం ఇవ్వలేదు. రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో లేవు. వెర్రిగెడ్డ ఆనకట్టను పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో ఖరీఫ్ సాగుకు నీరు కష్టమే.

– లగుడు నాగేశ్వరరావు, పి.కె.గూడెం

ఏయూకి దివీస్ రూ.3.21 కోట్ల సాయం



ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్

మద్దిలపాలెం (విశాఖ): ఆంధ్ర విశ్వవిద్యాలయంలో మౌలిక వసతుల కల్పనకు దివీస్ లేబొరేటరీస్ లిమిటెడ్ రూ. 3.21 కోట్ల విలువైన సహాయాన్ని అందించింది. ఇందులో భాగంగా రూ. 49.96 లక్షలతో ఆధునీకరించిన కెమిస్ట్రీ లేబొరేటరీ–2ని ఏయూ వైస్ చాన్సలర్ ఆచార్య రాజశేఖర్.. దివీస్ ల్యాబ్స్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎల్.వి.రమణ, జనరల్ మేనేజర్ వై.ఎస్.కోటేశ్వరరావులతో కలిసి ప్రారంభించారు. గతంలో రూ.36 లక్షలతో కెమిస్ట్రీ లేబొరేటరీ–1ని దివీస్ ఆధునీకరించిన సంగతి తెలిసిందే. అలాగే రూ.2.36 కోట్ల వ్యయంతో ఏయూలోని వివిధ విభాగాలు, హాస్టళ్లు, కార్యాలయాల్లో 72 ఆర్వో వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసింది. వీటిని ప్రారంభించిన అనంతరం వీసీ మాట్లాడుతూ ఈ మౌలిక వసతులు విద్యార్థుల ఆరోగ్యానికి, అభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయన్నారు. ఏయూ శతాబ్ది వేడుకల సందర్భంగా పరిశ్రమలు, దాతలు ఇలాంటి విరాళాలు అందించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దివీస్ చైర్మన్ మురళీ దివీస్ సందేశాన్ని సంస్థ ప్రతినిధులు చదివి వినిపించారు. తమ కుటుంబ సభ్యులు, ఉద్యోగుల్లో చాలా మంది ఏయూ పూర్వ విద్యార్థులని, ఉన్నత విద్యను అందిస్తున్న ఏయూకి సీఎస్సార్ నిధుల ద్వారా సహకారం అందించడం సంతోషంగా ఉందని తెలిపారు. రెక్టార్ ఎస్.కిశోర్‌బాబు రిజిస్ట్రార్ ఆచార్య ఈ.ఎన్.ధనుంజయరావు, దివీస్ సీఎస్సార్ మేనేజర్ డి.సురేష్ కుమార్ పాల్గొన్నారు.

'పొదుపు పద్య శతకం' పుస్తకావిష్కరణ



మాట్లాడుతున్న డాక్టర్ బేతవోలు రామబ్రహ్మం

సీతంపేట (విశాఖ): సాహిత్య సురభి సంస్థ ఆధ్వర్యంలో గురువారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆచార్య పేరి సర్వేశ్వర అవధాని, ఆచార్య బి.ఎస్.కె.సుందర శివరావు రచించిన పొదుపు పద్య శతకం పుస్తకావిష్కరణ జరిగింది. వృద్ధుల కల్యాణ రామారావు అధ్యక్షతన నిర్వహించిన సభలో డాక్టర్ బేతవోలు రామబ్రహ్మం చేతుల మీదుగా పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్యాల్లో మూడో పాదంలో కీలకాంశం నిక్షేపించారని, రచయిత కృషి యువతరాన్ని ఆకట్టుకునేదిలా ఉందన్నారు. డాక్టర్ డి.వి.సూర్యారావు మాట్లాడుతూ ఈ గ్రంథం పద్యబద్ధమైన సామాన్య భాషా పరిజ్ఞానం గల వారికి కూడా ఎంతో ఉత్సుకత కలిగిస్తూ చదివిస్తుందన్నారు. ఓరుగంటి రాజరాజేశ్వరి ప్రసాద్ పద్యాలను చదివి విశ్లేషణ చేశారు. కార్యక్రమంలో ఆచార్య కె.వి.రావు, సరవన్న, సాహితీ అభిమానులు పాల్గొన్నారు.

● హైడ్రో పవర్ ప్రాజెక్టుతో మన్యవాసుల జీవితాల్లో చీకట్లు

ప్రాణాలకు తెగించైనా అడ్డుకుంటాం

- గిరిజనుల భూముల జోలికి వస్తే తరిమికొడతాం
- అదాని కోసమే ఏజెన్సీ గ్రామాల్లో డిప్యూటీ సీఎం పవన్ పర్యటన
- గిరిజనులను మభ్యపెట్టి భూములను దోచుకోవాలని కుట్రలు
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శ
- చింతలపూడిలో హైడ్రో పవర్ ప్లాంట్ వ్యతిరేక సదస్సు



గిరిజనుల పోరాటానికి సంఘీభావం ప్రకటిస్తున్న సీపీఎం నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు

దేవరాపల్లి: గిరిజనుల జీవితాలను చీకటిమయం చేసే అదాని హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిర్మాణ పనులను స్థానిక ప్రజలు, గిరిజనులతో కలిసి ప్రాణాలకు తెగించైనా అడ్డుకొని తీరుతామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. దేవరాపల్లి మండలం చింతలపూడి పంచాయతీలో హైడ్రో పవర్ ప్లాంట్‌కు వ్యతిరేకంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న అధ్యక్షతన గురువారం బహిరంగ సదస్సు జరిగింది. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ దేవరాపల్లి మండలం చింతలపూడి పంచాయతీలో, అల్లూరి జిల్లా పెదకోట సమీపంలో దొడ్డి దారుల్లో అదాని పవర్ ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఈ ప్రాంత ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. తరతరాలుగా జీవిస్తున్న గిరిజనులను ఈ ప్రాంతం నుంచి వెళ్లగొట్టేందుకు పెద్ద కుట్ర జరుగుతోందన్నారు. ప్రజల మేలు కోసమే ప్రాజెక్టులు నిర్మిస్తే చట్టం ప్రకారం గ్రామ సభల ఆమోదంతోనే పనులు చేపట్టాలని, ఇలా అడ్డదారుల్లో ఎందుకు ప్రయత్నిస్తున్నారని ప్రశ్నించారు. మోదీ దత్తపుత్రుడు అదాని ఎక్కడ అడుగు పెడితే అక్కడ భస్మీపటలం అవుతుందన్నారు. గిరిజనుల భూములను అదానీకి దోచి పెట్టేందుకే ఇటీవల డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మోదీ సూచనతో గిరిజన ప్రాంతాల్లో పర్యటించారని ఆరోపించారు. నెల రోజుల్లో డోలీ మోతలు లేకుండా చేస్తానని చెప్పిన డిప్యూటీ సీఎం 13 నెలలు పూర్తయినా పట్టించుకోక పోవడం దారుణమన్నారు.



బహిరంగ సదస్సుకు అధిక సంఖ్యలో హాజరైన గిరిజనులు

జీవో నెంబర్ 51ను తక్షణమే రద్దు చేయాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.లోకనాథం మాట్లాడుతూ గిరిజనుల జీవితాలను నాశనం చేసే పవర్ ప్రాజెక్టుల అనుమతులను, జీవో నెంబర్ 51ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ రెండు ప్రాజెక్టులకు నీరు అందించే జీవనదులు రైవాడ జలాశయం క్యాచ్‌మెంట్ ఏరియాలో ఉన్నాయని, దీంతో రైవాడ ఆయకట్టు భూములు బీడులుగా మారడంతో పాటు విశాఖ నగర వాసులకు తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం చింతలపూడి పంచాయతీ, మారిక గ్రామాల మధ్య హైడ్రో పవర్ ప్లాంట్ నిర్మాణాన్ని రద్దు చేయాలని, జీవో నెంబర్ 51ను ఉపసంహరించాలని, భూములు సాగు చేస్తున్న గిరిజనులకు పట్టాలివ్వాలని సీపీఎం మండల కార్యదర్శి బి.టి.దొర తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కిల్లో సురేంద్ర, సీపీఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, పాడేరు జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స, విజయనగరం జిల్లా కార్యదర్శి టి.సూర్యనారాయణ, అనంతగిరి జెడ్పీటీసీ దీసిరి గంగరాజు, చింతల సర్పంచ్ దొమ్మంగి బోడెమ్మ, తామరబ్బ సర్పంచ్ టోకురి రామకృష్ణ, గుమ్మడపు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వీరమల్లుకు సాష్టాంగం

నిబంధనలను పాతరేసిన ఏయూ అధికారులు

- ప్రభుత్వ జీవోను కాదని సినిమా ఈవెంట్‌కు అనుమతి
- బయటకు పొక్కకూడదని వీసీ రహస్య సమావేశం
- కూటమి ప్రభుత్వంలో దిగజారుతున్న వర్సిటీ ప్రతిష్ట



విశాఖ సిటీ: 'హరి హర వీరమల్లు'కు ఆంధ్రా యూనివర్సిటీ ఉన్నతాధికారులు సాష్టాంగపడ్డారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సినిమా ఫంక్షన్ కోసం నిబంధనలకు పాతరేశారు. ప్రభుత్వ విద్యా సంస్థల మైదానాలు, ప్రాంగణాలు ప్రైవేటు సభలు, సమావేశాలకు కేటాయించకూడదన్న ప్రభుత్వ ఉత్తర్వులను బుట్టదాఖలు చేశారు. నెల కిందట బుక్ చేసుకున్న ఒక విద్యా సంస్థ వేడుకలను సైతం రద్దు చేసి మరీ ఉప ముఖ్యమంత్రి సినిమా ప్రీ రిలీజ్ వేడుకకు అనుమతులిచ్చేశారు. ఇపుడు ఈ విషయం బయటకు పొక్కితే ఇబ్బందులు వస్తాయని వర్సిటీ ఉపకులపతి జి.పి.రాజశేఖర్ విభాగాధిపతులతో రహస్య సమావేశం నిర్వహించడం కొసమెరుపు. ఒకవైపు హాస్టళ్లలో పురుగుల అన్నం తినలేక, సౌకర్యాలు లేక విద్యార్థులు ఆందోళన బాట పడితే, వాటిని పరిష్కరించని ఏయూ పాలకులు.. రాజకీయ, సినీ పెద్దల సేవలో తరించడం వివాదాస్పదమవుతోంది.

ఏయూలో రాజకీయ క్రీనీడ

ఆంధ్ర విశ్వవిద్యాలయం కూటమి రాజకీయ క్రీనీడకు వేదికగా మారిపోయింది. కూటమి ప్రజాప్రతినిధుల జన్మదిన వేడుకలకు, ఆ పార్టీల కార్యక్రమాలకు కేంద్రంగా మార్చేశారు. ఎప్పటికప్పుడు కూటమి నేతల కటౌట్లు, బ్యానర్లతో యూనివర్సిటీని కప్పేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఏయూలో తీసుకున్న నిర్ణయాలపై బురద జల్లే ప్రయత్నం చేశారు. వాటిపై లోతైన విచారణ చేపట్టాలని నిర్ణయిస్తూ ప్రత్యేక కమిటీని సైతం ఏర్పాటు చేశారు. నెలలు గడుస్తున్నా.. ఇప్పటి వరకు ఒక్క తప్పును కూడా నిరూపించలేకపోయారు. దీంతో ఆ కమిటీ నివేదికను పక్కనపెట్టేశారు. తాజాగా కూటమి పెద్దల సూచనలతో అధికారులు వివాదాస్పద నిర్ణయాల దిశగా అడుగులు వేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అతిథి ఉపాధ్యాయుల విషయంలో గతంలో ఎన్నడూ లేని విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. ఏళ్ల తరబడి గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేస్తున్న వారిని రోడ్డున పడేయాలని చూస్తున్నారు. వారి స్థానంలో కొత్త వారిని నియమించేందుకు ఏయూ అధికారులపై కూటమి నేతలు ఒత్తిడి చేస్తున్నట్లు వర్సిటీలో చర్చ జరుగుతోంది.

ఆదిత్య కాలేజీ వేడుకను రద్దు చేసి మరీ..

వాస్తవానికి ఆదిత్య కాలేజీ 1,500 మంది ఉత్తరాంధ్ర విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో అచీవర్స్ డే నిర్వహించాలని నిర్ణయించింది. ఇందుకోసం నెల రోజుల కిందటే ఏయూ కన్వెన్షన్ సెంటర్‌ను బుక్ చేసుకున్నట్లు తెలుస్తోంది. అయినప్పటికీ 'హరి హర వీరమల్లు' సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్‌కు అదే వేదికను అడగడంతో, ఏయూ అధికారులు వెంటనే ఆదిత్య కాలేజ్ బుకింగ్‌ను రద్దు చేసేశారు. కేవలం రెండు రోజుల ముందే వారికి సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. దీంతో ఆదిత్య కాలేజీ తమ వేడుకలను రద్దు చేసుకోవాల్సి వచ్చినట్లు సమాచారం. ఒక కాలేజీ కార్యక్రమాన్ని రద్దు చేసి మరీ సినిమా వేడుకకు ఏయూ కన్వెన్షన్ సెంటర్‌ను కేటాయించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నిబంధనలకు విరుద్ధంగా..

ప్రభుత్వ విద్యా సంస్థల ఆట స్థలాలు, ప్రాంగణాలను అకడమిక్ కార్యక్రమాలకు మాత్రమే వినియోగించాలని ప్రభుత్వం ఈ ఏడాది జనవరి 29వ తేదీన ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం ప్రభుత్వ విద్యా సంస్థల ప్రాంగణాల్లో రాజకీయ, సినిమా, ఇతర సభలు, సమావేశాల నిర్వహణకు లీజుకిచ్చే అవకాశం లేదు. కానీ ఏయూ ఉన్నతాధికారులు మాత్రం ఈ ఉత్తర్వులను తుంగలో తొక్కారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహణకు నిబంధనలకు విరుద్ధంగా ఏయూ కన్వెన్షన్ సెంటర్‌ను కేటాయించారు. దీనిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఏయూ వీసీ రహస్య సమావేశం?

ఏయూ హాస్టళ్లలో అధ్వాన పరిస్థితులపై విద్యార్థులు రెండు రోజుల పాటు ఆందోళన చేశారు. పురుగుల అన్నం పెడుతున్నారని, హాస్టళ్లలో కనీస సౌకర్యాలు కల్పించడం లేదని నిరసన తెలిపారు. ఫీజుల కోసం ఒత్తిడి చేస్తున్నారని, ఏయూ అధికారులు అనుసరిస్తున్న వైఖరికి వ్యతిరేకంగా వీసీ కార్యాలయాన్ని ముట్టడించారు. విద్యార్థుల సమస్యలను పట్టించుకోని ఏయూ అధికారులు.. సినిమా ఫంక్షన్ వ్యవహారంపై ప్రత్యేకంగా భేటీ అవడం చర్చనీయాంశమవుతోంది. ప్రభుత్వ ఉత్తర్వులకు వ్యతిరేకంగా సినిమా వేడుకకు కేటాయించిన విషయం బయటకు వస్తే.. తలనొప్పులు తప్పవన్న ఆందోళన వారిలో మొదలైంది. దీనిపై ఏయూ వీసీ రాజశేఖర్ విభాగాధిపతులతో రహస్యంగా సమావేశం నిర్వహించినట్లు సమాచారం. సినిమా ఫంక్షన్‌కు కన్వెన్షన్ సెంటర్‌ను కేటాయించడంపై కోర్టుకు వెళితే ఇబ్బందులు తప్పవని ఆ సమావేశంలో ఆయన పేర్కొన్నట్లు తెలిసింది. ఈ నిబంధనల విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్తగా ఉండాలని, సినిమా ఫంక్షన్ వ్యవహారంపై ఎవరూ బయట చర్చించవద్దని సూచించినట్లు ఏయూలో గుసగుసలు వినిపిస్తున్నాయి.

క్లుప్తంగా

తాండవ నీటిమట్టం 370.10 అడుగులు



తాండవ ప్రాజెక్టులో పెరుగుతున్న నీటి మట్టం

నాతవరం: తాండవ రిజర్వాయరులో నీటి మట్టం క్రమేపి పెరుగుతుందని ప్రాజక్టు జేఈ శ్యామ్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన ఇక్కడ నీటిమట్టాన్ని పరిశీలించారు. తాండవ కాలువల మరమ్మతులు, పూడికతీత పనులు వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. గురువారం సాయంత్రానికి రిజర్వాయరులో నీటిమట్టం 370.10 అడుగులకు చేరిందన్నారు. 350 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వస్తుందన్నారు. ప్రమాదస్థాయి నీటిమట్టం 380.0 అడుగులుగా పరిగణిస్తామన్నారు. రెండు జిల్లాల్లోని 52 వేల ఎకరాల్లో ఖరీఫ్ సాగుకు నీరు సరఫరా చేయాలంటే ప్రాజెక్టులోకి మరింత నీరు చేరాలన్నారు. వచ్చే నెల 10 నుంచి 15వ తేదీలోపు ఆయకట్టుకు నీరు విడుదల చేయడానికి ఇటీవల నీటి సంఘాలు తీర్మానించాయన్నారు.

విద్యార్థి గౌతమ్ తల్లిదండ్రులకు అప్పగింత



విద్యార్థి ఉల్లింగల గౌతమ్‌ను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

కశింకోట : మండలంలోని వెదురుపర్తి గ్రామానికి చెందిన టెన్త్ విద్యార్థి ఉల్లింగల గౌతమ్ (14) కనిపించకుండా పోయిన అనతి కాలంలోనే పోలీసులు పట్టుకొని తల్లిదండ్రులకు అప్పగించారు. సీఐ అల్లు స్వామినాయుడు గురువారం అందించిన వివరాల ప్రకారం.. వెదురుపర్తి హైస్కూల్లో టెన్త్ చదువుతున్న గౌతమ్ బుధవారం ఉదయం 11 గంటలకు విరామ సమయంలో స్కూలు నుంచి బయటకు వెళ్లాడు. ఇంటికి చేరలేదు. తల్లిదండ్రులు ఆందోళన చెంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ అల్లు స్వామినాయుడు పర్యవేక్షణలో ఎస్ఐ కె. లక్ష్మణరావు, కానిస్టేబుల్ అప్పలరాజు బృందంగా వెళ్లి సీసీ కెమెరాల పుటేజీలు ఆధారంగా యలమంచిలి వైపు వెళ్లినట్టు గుర్తించి గౌతమ్‌ను గురువారం పట్టుకొని తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

ఒంటరి మహిళలే లక్ష్యంగా చైన్ స్నాచింగ్‌లు

- మైనర్ సహా ముగ్గురు నిందితుల అరెస్టు, రిమాండ్
- 26 తులాల బంగారు నగలు, 3 ద్విచక్ర వాహనాలు, 3 సెల్‌ఫోన్ల స్వాధీనం
- సాంకేతిక పరిజ్ఞానంతో ఛేదించిన పోలీసులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్‌లు



9 చైన్ స్నాచింగ్ కేసుల్లో పోలీసులు స్వాధీనం చేసుకున్న నగలు

కశింకోట: జిల్లాలో తొమ్మిది చైన్ స్నాచింగ్ కేసుల్లో మైనర్ సహా ముగ్గురు నిందితుల్ని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి రూ.26 లక్షల విలువ చేసే 26 తులాల బంగారు నగలు, మూడు ద్విచక్ర వాహనాలు, మూడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అనకాపల్లి డీఎస్పీ ఎం. శ్రావణి వివరాలు వెల్లడించారు.

నర్సీపట్నంలో నివాసముండే తూర్పు గోదావరి జిల్లా అనపర్తికి చెందిన కర్రి నానిరెడ్డి, ఎస్. రాయవరం మండలం వాకపాడు గ్రామానికి చెందిన సెలూన్ దుకాణం నిర్వాహకుడు తారుతురి రమేష్, మరో మైనర్‌తో కలిసి జిల్లాలో పలుచోట్ల చైన్ స్నాచింగ్‌లకు పాల్పడ్డారు. ప్రధాన నిందితుడు నానిరెడ్డి రాజమహేంద్రవరంలో చదువు మానేసి నర్సీపట్నం వచ్చి తన తండ్రి ముత్తారెడ్డితో గ్రామాల్లో తిరుగుతూ వాయిదాల పద్ధతిపై ప్లాస్టిక్ సామాన్లు విక్రయించేవాడు. అనంతరం నర్సీపట్నంలో హోం నీడ్స్ మెటల్ దుకాణం నడుపుతూ పూర్తిగా నష్టపోయాడు. దీంతో ఫైనాన్స్ చేసిన వారు నగదు కోసం గొడవ చేస్తుండటంతో వారి ఒత్తిడిని తట్టుకోలేక యూట్యూబ్ చానల్‌లో మహిళల మెడలో బంగారు ఆభరణాలు దొంగతనం చేసే వీడియోలు చూసి ప్రేరణ పొందాడు. మిగిలిన ఇద్దరు నిందితులతో కలిసి జిల్లాలోని ఐదు మండలాల్లో 9 చోట్ల దొంగతనాలకు పాల్పడేవారు. ఈ క్రమంలో కశింకోటలోని భవానీకాలనీకి చెందిన భార్యాభర్తలు నడిచి వెళ్తుండగా, ఈ నెల 1న గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి ఆమె మెడలో నాలుగు తులాల బంగారు తాడును లాక్కొని పరారయ్యారు. ఈ విషయమై కేసు నమోదు చేసి సీఐ అల్లు స్వామినాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐలు లక్ష్మణరావు, మనోజ్‌కుమార్, కానిస్టేబుళ్లు డి. గోపి, బండారు శ్రీనివాసరావు, జి. శ్రీనివాసరావు, బి. మహేశ్వరరావు, బి. దిలీప్ కుమార్ (ఐటీ కోర్ కానిస్టేబుల్)లతో మూడు బృందాలను ఏర్పాటు చేశారు. వీరు నిందితులను పట్టుకోవడానికి 23 రోజులపాటు శ్రమించారు. కశింకోట నుంచి నర్సీపట్నం వరకు సీసీ కెమెరాలను పరిశీలించిన మీదట వీడియో పుటేజీల ఆధారంగా చోరీకి పాల్పడిన నిందితులను తాళ్లపాలెం వద్ద పట్టుకున్నారు. దీనితోపాటు గతంలో కశింకోట మండలం నూతలగుంటపాలెం, మాకవరపాలెం మండలం కొండల అగ్రహారం, యలమంచిలి మండలంలో తులసీనగర్, కృష్ణాపురం, ఎస్. రాయవరం మండలం దార్లపూడి, గోకులపాడు, జేవీ పాలెం గ్రామాలు, బుచ్చియ్యపేటలో ఒంటరి మహిళలను లక్ష్యంగా చేసుకొని వారి మెడలో బంగారు వస్తువులను తస్కరించారు. ఈ నేపథ్యంలో ఎస్పీ తుహీన్ సిన్హా, ఏఎస్పీ ఎల్. మోహనరావుల పర్యవేక్షణలో డీఎస్పీ శ్రావణి, సీసీఎస్ సీఐ అప్పలనాయుడుల ఆధ్వర్యంలో సాంకేతిక పరిజ్ఞానంతో కశింకోట పోలీసులు ఈ కేసులను ఛేదించారు. ఇటువంటి సంఘటనలతో ప్రజలు భయపడకుండా రోడ్లపై వెళ్లే మహిళలు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ కోరారు. యువత చెడు వ్యసనాలను దూరంగా ఉండాలన్నారు. సమావేశంలో సీఐ స్వామినాయుడు, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

టీడీఆర్ బాండ్లు స్వీకరించి అభివృద్ధికి సహకరించాలి

- కలెక్టర్ విజయ కృష్ణన్



అనకాపల్లి-అచ్యుతాపురం భూ నిర్వాసితులకు టీడీఆర్ బాండ్లు అందిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: అనకాపల్లి- అచ్యుతాపురం ప్రధాన రహదారి విస్తరణలో భూములు కోల్పోయిన నిర్వాసితులకు పరిహారంగా టీడీఆర్ బాండ్లు అందిస్తున్నట్లు కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. ఇద్దరు భూ నిర్వాసితులకు గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో వీఎంఆర్‌డీఏ ద్వారా టీడీఆర్ బాండ్లు ఆమె అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూములు కోల్పోయిన ఇతర నిర్వాసితులు సుముఖతతో ముందుకొచ్చి, తగిన దస్తావేజులతో టీడీఆర్ బాండ్లు తీసుకోవాలన్నారు. ప్రజల కోసం చేపట్టిన అభివృద్ధి పనులకు సహకరించాలన్నారు. సత్వర న్యాయం చేస్తూ, సాయం అందించడంలో చర్యలు వేగవంతంగా చేపడతామన్నారు. ఇందులో భాగంగా భూమి విలువకు నాలుగు రెట్ల అధిక విలువ గల బాండ్లను అచ్యుతాపురం మండలం కొండకర్ల గ్రామానికి చెందిన కోసూరి నారాయణ రావుకు, మునగపాక మండలం జేపీ అగ్రహారం గ్రామానికి చెందిన కె. అనురాధకు అందించామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో షేక్ అయిషా, మునగపాక, అచ్యుతాపురం తహసీల్దార్లు పి.సత్యనారాయణ, జి.సత్యనారాయణ పాల్గొన్నారు.

పెళ్లింట విషాదం

- రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి



నాగేశ్వరరావు(ఫైల్)

కశింకోట: మరికొద్ది రోజుల్లో పెళ్లి బాజాలు మోగాల్సిన ఆ ఇంట విషాద ఛాయలు అలుముకున్నాయి. తమ ఒక్కగానొక్క కుమారుడిని ఓ ఇంటి వాడిని చేసి తమ ముచ్చట తీర్చుకుందామన్న ఆ తల్లిదండ్రులకు తీవ్ర గర్భశోకం మిగిలింది. ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు మృత్యువుతో పోరాటం చేసి చివరికి తుది శ్వాస విడిచాడు. మండలంలోని చింతలపాలెం గ్రామానికి చెందిన యువకుడు గురువారం విశాఖ కేజీహెచ్‌లో మృతి చెందాడు. సీఐ అల్లు స్వామినాయుడు వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బుదిరెడ్డి నాగేశ్వరరావు (30) పరవాడ వద్ద ప్రైవేటు పరిశ్రమలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో కంపెనీలో విధులకు వెళ్లడానికి ఈ నెల 22న తమ గ్రామంలో రోడ్డు దాటుతుండగా అనకాపల్లి నుంచి యలమంచిలి వైపు వెళ్తున్న కారు ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడటంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సీఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఈ నెల 30న వివాహం జరగాల్సి ఉండగా...

మృతుడు నాగేశ్వరరావు తమ తల్లిదండ్రులు అప్పలనాయుడు, పార్వతి దంపతులకు మగ సంతానం ఒక్కరే. ఇద్దరు ఆడ పిల్లలకు పెళ్లయింది. తాజాగా మృతుడు నాగేశ్వరరావుకు వివాహం నిశ్చయమైంది. ఈ నెల 30న వివాహం జరగాల్సి ఉంది. ఇంతలో రోడ్డు ప్రమాదంలో గాయపడి మృత్యువాత పడ్డాడు. దీంతో శుభకార్యం జరగాల్సిన ఆ ఇంట ఈ సంఘటన చోటు చేసుకోవడం తీవ్ర విషాదాన్ని నింపింది.



ఆశల సాగు

బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలు సాగుపై ఆశలు పెంచుతున్నాయి. ఇప్పటివరకు వరినాట్లు వేసే స్థాయిలో వర్షాలు పడకపోవడంతో రైతులు నిరాశకు గురయ్యారు. ఈ తరుణంలో వర్షాలు కురుస్తుండటంతో వరి నాట్ల పనుల్లో నిమగ్నమయ్యారు.

- సాక్షి, పాడేరు

వాడనర్సాపురంలో విషాద ఛాయలు

- నాగార్జునసాగర్‌లో వేటకు వలస వెళ్లి మత్స్యకారుడు మృతి



మృతుడు జగన్నాథం

రాంబిల్లి (అచ్యుతాపురం): రాంబిల్లి మండలంలోని వాడనర్సాపురంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన మత్స్యకారుడు చింతకాయల జగన్నాథం (42) బతుకు దెరువు కోసం తెలంగాణలోని నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌కు సమీపంలో చేపల వేట కోసం వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. ఆయా గ్రామస్తుల కథనం మేరకు.. సముద్రంలో మత్స్య సంపద తగ్గిపోవడంతో వాడనర్సాపురానికి చెందిన 50 కుటుంబాల వారు నాగార్జునసాగర్ వద్ద చేపల వేట కోసం వలస వెళ్తున్నారు. కొంతమంది అక్కడ నివాసం ఉండిపోగా, మరికొంత మంది ఏడాదికొకసారి కాంట్రాక్టు మీద, తాత్కాలిక నివాసం కింద వెళ్తున్నారు. గ్రామానికి చెందిన జగన్నాథం బుధవారం ఉదయం నాగార్జునసాగర్ పరిధిలో లంబాపురం కృష్ణానదిలో తన తోటి మత్స్యకారులతో కలిసి వేటకు వెళ్లారు. నదిలో చేపల కోసం వల వేయగా, అడుగున్న ఉన్న రాయికి చిక్కుకుంది. ఎంతకూ వల రాకపోవడంతో నీటిలో దిగిన జగన్నాథం బయటకు రాలేదు. దీంతో ఇతర మత్స్యకారులు నదిలోకి దిగి వెతకగా అతడు ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు గుర్తించారు. దీంతో వాడనర్సాపురానికి చెందిన మత్స్యకారులు లంబాపురం వెళ్లి అక్కడి శవపంచానామా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. శుక్రవారం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బతుకు దెరువు కోసం వలస వెళ్లిన మత్స్యకారుని మరణంతో అతని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఆర్అఆర్ ప్యాకేజీ గుర్తింపులో అన్యాయం

- సీఎంవోకు వీఆర్‌పురం వాసుల ఫిర్యాదు



రాంబిల్లి మండలం వీఆర్‌పురంలో సర్వే నిర్వహిస్తున్న దృశ్యం(ఫైల్)

రాంబిల్లి (అచ్యుతాపురం): పరిశ్రమల ఏర్పాటు కోసం భూములు తీసుకుంటున్న ఏపీఐఐసీ తదనంతరం లబ్ధిదారులను గుర్తించి న్యాయం చేసే విషయంలో సరైన వ్యవస్థను, ప్రమాణాలను పాటించడం లేదు. అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల పరిధిలో వేలాది ఎకరాల భూములను ఎస్ఈజెడ్ కోసం రెండు విడతలుగా సేకరించారు. దీనిలో భాగంగా రాంబిల్లి మండలం గోరంపూడి, వెల్చూరు, అప్పన్నపాలెం శివారు గ్రామాలైన వీఆర్‌పురం పరిధిలో 38 మంది నిర్వాసితులు ఏర్పాటు చేసుకున్న నివాసాలకు సంబంధించి ఆర్అఆర్ ప్యాకేజీ మంజూరుకు జనవరి నుంచి రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ చేపట్టారు. ఈ విషయంలో తమకు అన్యాయం జరిగిందంటూ కొంతమంది ఇటీవల సీఎంవోకు రాంబిల్లి తహసీల్దార్‌పై ఫిర్యాదు చేశారు. రాజకీయ ఒత్తిళ్లతో ఈ తరహా ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ వారు ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 23 మంది సంతకాలతో కూడిన ఫిర్యాదు కాపీని సీఎంవోకు పంపించారు. తమ స్థిర నివాసాలను పశువుల పాకలుగా పరిగణించి తప్పుడు నివేదికలు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని ఫిర్యాదులో కోరారు.

'బల్క్‌డ్రగ్ పరిశ్రమకు భూములివ్వం'

ఎస్.రాయవరం :

విష వాయువులు, రసాయనాలు వెదజల్లే బల్క్‌డ్రగ్ పరిశ్రమకు భూములు ఇచ్చేది లేదని గుర్రాజుపేట గ్రామ రైతులు గురువారం అన్నారు. గుర్రాజుపేట సచివాలయం స్థానిక విలేకరులతో మాట్లాడారు. గుడివాడ రెవెన్యూలో గుర్రాజుపేట గ్రామ పరిధిలో సర్వే నంబర్ 206–2 లో 172 ఎకరాల భూమిని తీసుకుంటున్నట్టు ఇటీవల స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చెప్పారన్నారు. అయితే రసాయనాలు వెదజల్లే కంపెనీకి భూములు ఇవ్వబోమని ఆరోజు చెప్పామని, వచ్చే నెల 6 వ తేదీన నక్కపల్లి తహసీలాందర్ కార్యాలయం వద్ద నిర్వహించే ప్రజాభిప్రాయ సేకరణ రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

అత్యంత ప్రమాదకరంగా మారే బల్క్ డ్రగ్ పరిశ్రమ ఏర్పాటు చేసి మా ప్రాంతాన్ని డంపింగ్ యార్డుగా మార్చవద్దని అన్నారు. పచ్చగా కొబ్బరి, జీడిమామిడి తోటల సాగుతో రైతులకు, రైతు కూలీలకు ఎంతోకాలంగా ఉపాధి దొరుకుతోందన్నారు.

ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, జిల్లా కమిటీ సభ్యులు ఎం.సత్యనారాయణ, కె.వెంకటపతిరాజు, దాట్ల శ్రీరామరాజు, ఉమాదేవి, కె.కృష్ణంరాజు, సీహెచ్.శివరాజు, ఉపాధ్యాయులు మహాదేవ్, డి. నరసింహ మూర్తిరాజు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న రైతులు

వాగు దాటితేనే చదువు సాగేది..



కృష్ణాపురంలోని పాఠశాలకు గెడ్డదాటి వస్తున్న విద్యార్థులు

- ప్రమాదకరమైన వాగును దాటుతూ పాఠశాలకు..
- బూసిపల్లి, నీలమెట్ట, తోకచిలక గ్రామ విద్యార్థుల అవస్థలు

జి.మాడుగుల: మండలంలో బూసిపల్లి, నీలమెట్ట, తోకచిలక గ్రామాల విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు సాహసం చేయాల్సి వస్తోంది. ఆయా గ్రామాలకు చెందిన సుమారు 50 మంది విద్యార్థులు కృష్ణాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుకుంటున్నారు. వీరు ప్రతిరోజు రెండు కిలోమీటర్ల మేర కాలినడకన పాఠశాలకు వస్తుంటారు. మార్గం మధ్యలోని కొంగవాగును ప్రమాదకర పరిస్థితుల మధ్య దాటాల్సి వస్తోంది. వర్షాకాలంలో వీరిని స్కూల్‌కు పంపేందుకు తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం వేళలో దగ్గరుండి వాగును దాటించి అవతలి ఒడ్డుకు చేర్చుతున్నారు. స్కూల్ ముగిసిన తరువాత సాయంత్రం మళ్లీ వాగు వద్దకు వచ్చి వారిని దగ్గరుండి తీసుకువస్తున్నారు. ప్రభుత్వం అధికారులు స్పందించి కృష్ణాపురం- బూసిపల్లి గ్రామాల మధ్య రెండు కిలోమీటర్ల పొడవునా రోడ్డు నిర్మించడమే కాకుండా వాగుపై కల్వర్టు ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలని మూడు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రాగి సాగు.. ఇకపై బాగు

జిల్లాలో రాగి పంటలో అత్యధిక దిగుబడి, మెరుగైన పోషక విలువలు గల వేగావతి, ఇంద్రావతి నూతన వంగడాలు గిరిజన రైతులకు అందుబాటులోకి రానున్నాయి. ఇందుకు అవసరమైన కసరత్తును చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు మొదలుపెట్టారు. త్వరలోనే రైతు స్థాయిలో విస్తరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. తద్వారా సాగుకు పూర్వవైభవం వస్తుందని ఆశిస్తున్నారు.



రాగులు పంట కంకి(ఫైల్)



ఇంద్రావతి రాగులు పంట కంకి(ఫైల్)

- గిరి రైతుల చెంతకు వేగావతి, ఇంద్రావతి రకాల కొత్త వంగడాలు
- పరిచయం చేయనున్న చింతపల్లి ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు
- క్షేత్రస్థాయిలో మంచి ఫలితాలు
- సాగుకు అనుకూలించిన ఏజెన్సీ వాతావరణం
- పెరగనున్న సాగు విస్తీర్ణం



చింతపల్లి పరిశోధన స్థానంలో సాగు అవుతున్న ఇంద్రావతి రాగి పంట

చింతపల్లి: చిరుధాన్యాల పంటల్లో ఒకటైన రాగి (చోడి)ని మెట్ట ప్రాంతంలో రైతులు సాగు చేస్తున్నారు. పాడేరు డివిజన్‌లో ఒకప్పుడు అధిక విస్తీర్ణంలో ఉండే ఈ పంట విస్తీర్ణం రానురాను తగ్గిపోతోంది. ఒకప్పుడు పాడేరు డివిజన్‌లో సుమారు 30 వేల హెక్టార్లకు పైగా సాగులో ఉండేది. ఇప్పుడు సుమారు 20 వేల హెక్టార్లకు తగ్గిపోయింది. దేశవాళీ రకాలను సాగు చేయడం వల్ల దిగుబడి ఆశించిన స్థాయిలో ఉండటం లేదు. ఈ కారణంగానే సాగుపై గిరి రైతులకు ఆసక్తి తగ్గిపోతోంది. ఈ నేపథ్యంలో రాగి సాగుకు పూర్వ వైభవం తెచ్చేందుకు స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారు. దీనిలో భాగంగా కొత్త వంగడాలను రైతులకు పరిచయం చేసేందుకు కసరత్తు మొదలుపెట్టారు. వేగావతి, ఇంద్రావతి రకాలు ఏజెన్సీ ప్రాంతానికి అనువైనవిగా పరిశోధనల్లో గుర్తించారు.

→ నదుల పేర్లతో ఉన్న వేగావతి,ఇంద్రావతి రకాలను రైతులకు అందజేసేందుకు తొలిగా విజయనగరం వ్యవసాయ పరిశోధన స్థానంలో అధ్యయనం చేశారు. వీటిని అభివృద్ధి తరువాత ఈ రకాల దిగుబడులపై ఆర్ఏఆర్ఎస్‌లో సుమారు మూడేళ్లపాటు పరిశోధనలు చేశారు. ఇంద్రావతి రకంలో దిగుబడి ఆశాజనకంగా ఉన్నందున ఈ ప్రాంతానికి అనుకూలమని గుర్తించారు. సుమారు 115–120 రోజుల్లో పంట చేతికొస్తుంది. ఎకరాకు 14–15 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని శాస్త్రవేత్తలు తెలిపారు. ఇంద్రావతిలో ఫింగర్, నెక్, లీఫ్, బ్లాస్ట్, స్టెమ్, బోర్, డౌని, మిల్డ్యూ, అఫిడ్స్ వంటి రోగాలు, చీడపీడలను తట్టుకునే వ్యాధినిరోధక లక్షణాలు ఉన్నాయని చెబుతున్నారు. గతేడాది పాడేరు ప్రాంతంలో పది మంది రైతుల ద్వారా ఈ రకాన్ని సాగు చేయించారు. దిగుబడి ఆశాజనకంగా ఉన్నట్టు నిర్ధారణ అయింది. ఈ రకం విత్తనాలను గిరిజన ఉప ప్రణాళికలో పంపిణీ చేసేందుకు కృషి చేస్తున్నారు.

→ వేగావతి రకం సుమారు 110 నుంచి 115 రోజుల్లో పంట చేతికొస్తుంది. ఎకరాకు 14 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. గోధుమచ్చ తెగులు, శిలీంధ్రం/బాక్టీరియా వల్ల ఆశించే బ్యాండెడ్ బ్లైట్‌ను తట్టుకుంటుంది. ఈ రకం కూడా ఏజెన్సీకి అనుకూలంగా గుర్తించినట్టు శాస్త్రవేత్తలు తెలిపారు. ఇంద్రావతి రకం ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్నాటక, ఒడిశా, పుదుచ్చేరితోపాటు ఉత్తర భారతదేశంలో కూడా మంచి దిగుబడులు వస్తున్నాయని వారు వివరించారు. వేగవతి రకం సాగు చేస్తూ గుజరాత్,మహారాష్ట్ర ప్రాంతాల్లో రైతులు మంచి ఆదాయం పొందుతున్నారని శాస్త్రవేత్తలు తెలిపారు.

→ ఇంద్రావతి, వేగావతి రకాల్లో మెరుగైన పోషకాలు ఉన్నట్టు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఐరన్, కాల్షియం, జింక్ పోషకాలు అధికంగా ఉన్నట్టు వారు తెలిపారు. మార్కెట్‌లో రాగి ఆహార ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉన్నందున ఈ రెండు రకాల సాగు ద్వారా గిరి రైతులు మంచి ఆదాయం పొందవచ్చని వారు చెబుతున్నారు.

గుళి సాగు విధానంతో మేలు



చిరుధాన్యాల సాగు లాభదాయకంగా కావడంతో గిరిజన రైతాంగాన్ని ప్రోత్సహిస్తున్నాం. దీనిలో భాగంగానే వేగావతి, ఇంద్రావతి రకాలను అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నాం. ఈ రెండు రకాలను రైతులు గుళి విధానంలో సాగు చేపడితే మంచి దిగుబడి పొందవచ్చు. ఇందుకు అవసరమైన అవగాహన కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రణాళికపరంగా చర్యలు తీసుకుంటున్నాం.

– డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ రిసెర్చ్, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, చింతపల్లి



రాగులు పంట విత్తనాలు

క్లుప్తంగా

వరి నారుమడిలో జింక్ లోపం



మార్టూరులో పరిశీలిస్తున్న ఏవో రంగాచారి

అనకాపల్లి: వరి నారుమడిలో జింక్ లోపం వచ్చే అవకాశం ఉందని, జింక్ సల్ఫేట్ ఐదు గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని మండల వ్యవసాయ శాఖ అధికారి పి.బి.రంగాచారి తెలిపారు. సర్పంచ్ కరణం రెవెన్యూనాయుడు ఆధ్వర్యంలో మార్టూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుగ్రాసానికి యూరియా వాడటం వల్ల పశువులు, మనుషులు అనారోగ్యం బారిన పడే అవకాశాలు ఉన్నాయన్నారు. పొలాన్ని దమ్ము చేసేటప్పుడు ఒక బస్తా డీఏపీ, 20 కేజీలు పొటాషియం వేసినట్లయితే వరి దిగుబడి ఎక్కువగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు శ్రావణి, జోత్స్న పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన



పారిశుధ్యం తీరును పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ చక్రవర్తి

అనకాపల్లి టౌన్: ప్రజలందరూ తడి, పొడి చెత్త వేర్వేరుగా అందివ్వాలని జీవీఎంసీ జోనల్ కమిషనర్ చక్రవర్తి సూచించారు. పట్టణంలోని 83వ వార్డులో శానిటేషన్ పనుల తీరును గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలందరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం. అప్పారావు, కార్యదర్శి జి. మోహిని, సూపర్‌వైజర్ వి. బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై వర్షం నీటితో ఇబ్బందులు



చినబాబు కాలనీ సమీపంలో రోడ్డుపై నిలిచిపోతున్న వర్షపు నీరు

అనకాపల్లి టౌన్: అనకాపల్లి నుంచి తుమ్మపాల వెళ్లే రోడ్డులో చినబాబు కాలనీ సమీపంలో రోడ్డుపై వర్షపు నీరు నిలిచిపోతోంది. పలు విజ్ఞప్తుల మేరకు ఇటీవల రోడ్డు నిర్మించినా సైడ్ కాలువలు నిర్మించలేదు. దీంతో కొద్దిపాటి వర్షం పడినా నీరు నిలిచిపోతోంది. దీంతో రహదారిపై వెళ్లే వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే ఈ రోడ్డుకు ఇరువైపులా కాలువలు నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

శాకంబరిగా లక్ష్మీదేవి



అనకాపల్లి: మండలంలో మారేడుపూడి పంచాయతీ మారేడుపూడి బీసీ కాలనీలో గణపతి లక్ష్మీ సమేత శ్రీకృష్ణ ఆలయంలో లక్ష్మీదేవిని ఆషాఢ మాసం చివరి రోజు గురువారం అమ్మవారిని శాకంబరి దేవిగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపకుడు ఈగల కృష్ణమూర్తి, అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

రాజా	ద ఫెన్టాస్టిక్
సత్యనారాయణ స్క్రీన్-1	జూనియర్
సత్యనారాయణ స్క్రీన్-2	హరి హర వీరమల్లు
పర్తిసాయి	మహావతార్ నరసింహ
షిర్డీసాయి	హరి హర వీరమల్లు
వెంకటేశ్వర	హరి హర వీరమల్లు
శ్రీ సత్య	తమ్ముడు
రామచంద్ర	హరి హర వీరమల్లు

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 43 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-13, బీ పాజిటివ్-8, ఓ పాజిటివ్-20, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్త నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యాలోకేష్(9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 313 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 296 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

రైతులపై ప్రీమియం భారం

- ఖరీఫ్ పంటకు రైతే చెల్లించాలి
- 15లోగా చెల్లించాలని ఆదేశాలు
- ఆర్థిక భారమని అన్నదాతల ఆవేదన
- వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రభుత్వమే చెల్లించేది



వెంకుపాలెం గ్రామంలో వర్షాలు లేక ఎండుతున్న వరి నారుమడి

7 వేల ఎకరాల్లో ఖరీఫ్ పంటలు...

మండలంలో 32 పంచాయతీలకు గాను 23 పంచాయతీల్లో ఖరీఫ్ సీజన్‌లో 11 వేల మంది రైతులు పంటలు వేసుకునేందుకు సిద్ధంగా ఉన్నారు. ముందుగా వర్షాలు కురవడం, పంటలు వేసుకునే సమయంలో సరిగా వర్షాలు పడకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రైతులకు సాగునీరు పూర్తిగా అందడం లేదు. తుఫాన్ వస్తుందేమోనని ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో వరి నారుమడులు వేసి నీరులేక ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అనకాపల్లి: సీఎం చంద్రబాబు సర్కారు అన్నదాతలను దగా చేస్తోంది. పంటల బీమా పథకంలో రైతులే ప్రీమియం చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఆగస్టు 15వ తేదీలోపు చెల్లించాలని అందులో పేర్కొంది. గత వైఎస్సార్‌సీపీ పాలనలో ఏటా రైతుల తరపున ప్రీమియం అప్పటి ప్రభుత్వమే ఐదేళ్ల పాటు చెల్లించింది. దీనికి భిన్నంగా కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో రైతాంగం మండిపడుతోంది. గతేడాది సరైన సమయంలో వర్షాలు లేక.. పంటలు పండక..గిట్టుబాటు ధర లేక రైతులు ఇబ్బంది పడ్డారు. ఇప్పుడు బీమా ప్రీమియం చెల్లింపు వారికి అదనపు భారంగా మారింది. విత్తనాలు కొనేందుకు ఇంట్లో నగలు తాకట్టు పెట్టిన రైతన్నకు ఇది భారంగా మారుతోంది.

ప్రీమియం చెల్లింపు ....

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో పంట బీమాను రైతులు ముందుగానే చెల్లించాలి. ఎకరా స్థలానికి రూ.100 రైతులు గ్రామ సహాయకులకు చెల్లించాలి. వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రభుత్వమే ఒక్క రూపాయి రైతులపై వేసి ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేకుండా పంటల బీమా పథం అమలు చేసింది.

కూటమి ప్రభుత్వంలో రైతులపైనే భారం...

కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో బీమా ప్రీమియం భారం రైతులపై పడింది. ఖరీఫ్ సీజన్ నుంచి పంటలు సాగు చేసే ప్రతి రైతు పంటల బీమా పొందాలంటే ప్రీమియం చెల్లించాలి. ప్రభుత్వ సాయం అందక పెట్టుబడులకు అప్పులు చేసిన రైతులు ప్రీమియం చెల్లించాల్సిందేనని అధికారుల ఆదేశాలు జారీ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు కష్టాలు మొదలయ్యాయి. సీఎం చంద్రబాబు అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేసి ఏడాదికి రైతులు పంటలు వేసే సమయంలో రూ.20 వేలు అందిస్తామని చెప్పి గతేడాది ఇవ్వకుండా మోసం చేశారు. రెండో ఏడాది ఖరీఫ్ సీజన్ మొదలైనప్పటికీ నేటికి ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనకాపల్లి మండలంలో నేటి వరకూ పంట బీమా ప్రీమియం వంద మంది రైతులు మాత్రమే చెల్లించారు.

రైతులకు అండగా నిలిచిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం....

వైఎస్సార్‌సీపీ పాలనలో వ్యవసాయ రంగాన్ని, రైతులను ఆదుకునే దిశగా అప్పటి ప్రభుత్వం 2019 ఖరీఫ్ సీజన్ నుంచి ఉచిత పంటల బీమా పథకాన్ని తీసుకువచ్చింది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఈ-క్రాప్ నమోదు ప్రామాణికంగా ఉచిత పంటల బీమాను అమలు చేశారు. రైతులు సాగు చేసే మొత్తం విస్తీర్ణానికి చెల్లించాల్సిన ప్రీమియాన్ని ప్రభుత్వమే కట్టేలా చర్యలు తీసుకుంది. సాగు చేసిన ప్రతి ఎకరాకు బీమా పథకం వర్తించడంతో పంటలకు నష్టం వాటిల్లిన సందర్భంలో పూర్తిగా నష్టపరిహారం అందుకునే వారమని రైతులు గుర్తు చేసుకుంటున్నారు. కౌలు రైతులకు పరిహారాన్ని అందించినట్లు చెబుతున్నారు. దళారుల ప్రమేయం లేకుండా నేరుగా తమ ఖాతాలకు నగదు జమచేసే వారని చెబుతున్నారు.

పంట ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలి

ఏటా రెండెకరాల్లో వరి పంట వేస్తున్నాను. వైఎస్సార్‌సీపీ పాలనలో పంట బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించేది. కూటమి పాలనలో రైతులను పట్టించుకోవడం లేదు. పెట్టుబడికి ఏడాదికి రూ.20 వేలు చెల్లిస్తామని చెప్పిన నగదు నేటికీ ఇవ్వలేదు. కేంద్ర ప్రభుత్వం రైతుకు ఇస్తామని చెప్పిన నగదు గతేడాది తీసుకున్నాను.

– పి.కన్నాజీ, రైతు, తుమ్మపాల గ్రామం

ఈ ఏడాది రైతులు మోసపోయారు



ప్రభుత్వాలు మారినప్పటికీ రైతుల జీవితాలు మారడం లేదు. రైతులు పంటలు పండించే సమయంలో ఆదుకోవాలి. వరి పంటలు కోతకు వచ్చే సమయంలో తుపాన్ల ప్రభావంతో చేతికి అందొచ్చిన పంటల కొన్ని సందర్భాల్లో నష్టపోతున్నాం. ప్రీమియం ప్రభుత్వమే చెల్లించినట్లయితే రైతు పూర్తిగా నష్టపోకుండా కాపాడకోవచ్చు.

– కె.రాము. అనకాపల్లి రైతు, అనకాపల్లి

బీమా ప్రీమియం రైతులు చెల్లించాలి

రైతులు పండించే పంటలకు రైతులు బీమా చెల్లిస్తే ప్రయోజనం కలుగుతుంది. ఎకరా పంటకు రూ.100 చెల్లించాలి. దీనిపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. విపత్తుల కారణంగా పంటకు నష్టం కలిగితే నష్టాన్ని అంచనా వేసిన మేరకు బీమా పరిహారం చెల్లిస్తారు.

– పి.బి.రంగాచారి, ఏవో, అనకాపల్లి

చౌడేశ్వరి అమ్మవారి ఘటాల ఊరేగింపు



అమ్మవారి ఘటాలను ఊరేగిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు

అనకాపల్లి: స్థానిక చిన్నరాజుపేట చౌడేశ్వరి సాంబ శివ దేవాలయంలో చౌడేశ్వరి అమ్మవారి జయంతి సందర్భంగా గురువారం అమ్మవారి ఘటాల ఊరేగింపు జరిగింది. 200 మంది మహిళలు అమ్మవారి ఘటాలను పురవీధుల్లో ఊరేగించారు. దేవాలయంలో చౌడేశ్వరి అమ్మవారికి 108 కలశాలతో అభిషేకాలు, పంచామృత అభిషేకాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు రెడ్డి వరప్రసాద్, కార్యదర్శి మానెం సతీష్, కోశాధికారి బాసిన బాల గురూజీ, కమిటీ సభ్యులు అలంక బెన్నయ్య, ముప్పన వాసు, సంతోష్, మాణిక్యం రామకృష్ణ, మావూరు అయ్యప్ప, బూడిద తాతాజీ, బూడిద శివ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కశింకోట: మండలంలోని కన్నూరుపాలెం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మరమ్మతులు కారణంగా విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ కశింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్. రామకృష్ణ తెలిపారు. కన్నూరుపాలెంతో పాటు తీడ, చెరకాం, లాలంకొత్తూరు, సుందరయ్యపేట, ఆనందపురం, జి. భీమవరం, సింగవరం, అచ్చెర్ల, కొత్త అచ్చెర్ల, మోసయ్యపేట, గోకివానిపాలెం గ్రామాల్లో నిర్దేశిత సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని, వినియోగదారులు ఈ విషయాన్ని గుర్తించి తమ సిబ్బందికి సహకరించాలన్నారు.

వైభవంగా నూకాంబిక అమ్మవారి ఉత్సవం



పెట్ల నాగేశ్వరరావు స్వగృహం వద్ద నూకాంబిక అమ్మవారి ఘటాలు



ఘటాల ఊరేగింపులో పాల్గొన్న మలసాల భరత్‌కుమార్, పార్టీ నాయకులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం అరుంధతి నగర్‌లో నూకాంబిక అమ్మవారి ఉత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పెట్ల నాగేశ్వరరావు స్వగృహం వద్ద ఘటాల ఊరేగింపు కార్యక్రమం జరిగింది. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రశాంతమైన వాతావరణంలో పండగలు నిర్వహించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, 80, 84 వార్డుల ఇన్‌చార్జులు కె.ఎం.నాయుడు, కోరుకొండ రాఘవ, గవర కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ బొడ్డేడ శివ, పార్టీ నాయకులు కలగా గున్నయ్యనాయుడు, మరిపల్లి శోభ, నీటిపల్లి లక్ష్మి, పంచడి పద్మ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయంలో....

స్థానిక రింగ్‌రోడ్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ గురువారం పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చేవారం నుంచి, పట్టణ, గ్రామ కమిటీలను నియమిస్తామన్నారు. బాబు ష్యూరిటీ...మోసం గ్యారంటీ నినాదంతో గ్రామాల్లో సూపర్‌సిక్స్ అమలు కోసం ప్రజలను చైతన్యవంతులు చేసేందుకు వారి పక్షాన పోరాటాలు చేస్తామన్నారు. ప్రజలు కూటమి ప్రభుత్వానికి ఓటు వేసి మోసపోయామని తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. సరైన సమయంలో బుద్ధి చెప్పేందుకు ఎదురు చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ అనుసంధానంతోనే 'అన్నదాత సుఖీభవ'

అనకాపల్లి: అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి రెవెన్యూ శాఖలో ప్రతి రైతు తన భూమికి ఆధార్‌కార్డు అనుసంధానం చేయాలని మండల వ్యవసాయశాఖ అధికారి పి.బి.రంగాచారి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో ప్రతి రైతు, రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు. నమోదు చేసుకున్న తర్వాత గ్రామాల్లో వ్యవసాయ సహాయకుల్ని కలిసి వివరాలు తెలుసుకోవాలని కోరారు.

అధికారుల దృష్టికి విద్యుత్ సమస్య



విద్యుత్ బోర్డును పరిశీలిస్తున్న నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్

అనకాపల్లి టౌన్: పట్టణంలోని 83వ వార్డు భీమునిగుమ్మం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పాఠశాలలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో వైఎస్సార్ సీపీ నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్ స్పందించారు. ఆయన స్కూల్‌కి వెళ్లి సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. వెంటనే అధికారులు వచ్చి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి తక్షణమే విద్యుత్ సమస్యను పరిష్కరిస్తానని పబ్లిక్ వర్క్స్ ఏఈ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని యడ్ల రాణి, సమ్మంగి కనకరావు, తట్టా అరవింద్, బోనెల సాయి, నడిశెట్టి గోవింద్, రెడ్డి చిన్న తదితరులు పాల్గొన్నారు.

'రామాలయం భూమి ఆక్రమణ తగదు'

పాయకరావుపేట: శ్రీరాంపురం గ్రామానికి చెందిన సర్వే నంబరు 75/2లోని 25 సెంట్లు భూమి రికార్డులు ప్రకారం గ్రామంలోని రామాలయానికి చెందినదని తహసీల్దార్ ఎస్.ఎ.మహేశ్వరరావు తెలిపారు. రామాలయానికి చెందిన 25 సెంట్లను గ్రామానికి చెందిన కొందరు చదును చేస్తుండడంతో తహసీల్దార్‌కు ఫిర్యాదు అందింది. ఈ మేరకు ఆయన ఈ భూమిలో ఏవిధమైన పనులు చేపట్టవద్దని, రికార్డుల ప్రకారం ఈ భూమి రామాలయానిదని చెప్పారు. రికార్డులు ఉంటే హక్కుదారులు తమ వద్దకు తీసుకురావాలన్నారు.

వేళాపాళా లేకుండా విధులకు హాజరు



ఉదయం 10.30 గంటలైనా తెరచుకోని అక్కిరెడ్డిపాలెం వైద్య ఆరోగ్య కేంద్రం

తుమ్మపాల: మండలంలో అక్కిరెడ్డిపాలెం గ్రామీణ ఆరోగ్య కేంద్రాన్ని వేళాపాళా లేని సమయాల్లో తెరవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాతావరణ మార్పులతో గ్రామంలో తీవ్ర అనారోగ్య పరిస్థితులు నెలకొన్నాయి. విలేజ్ హెల్త్ అసిస్టెంట్, ఎంఎల్‌హెచ్‌పీ, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండటం లేదని వృద్ధులు లబోదిబోమంటున్నారు. రోజూ 9 గంటలకు కేంద్రంలో ఉండాల్సిన సిబ్బంది 10.30 గంటల సమయం దాటినా రావడం లేదని, వస్తారో రారో తెలియక జ్వరపీడితులు, వృద్ధులు గంటల పాటు వేచిచూస్తున్నారని పలువురు వాపోతున్నారు. గ్రామంలో ఆరోగ్య కేంద్రం ఉన్నప్పటికి వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం కారణంగా ప్రైవేటు క్లినిక్‌లకు వెళ్లాల్సి వస్తుందని, అధికారులు దృష్టి సారించి ఎల్లవేళలా సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

స్మార్టు మీటర్లకు వ్యతిరేకంగా ప్రచారం



విద్యార్థులకు వివరిస్తున్న సీఐటీయూ జిల్లా నాయకుడు శ్రీనివాసరావు

కశింకోట: ఇళ్లకు స్మార్టు మీటర్లు అమర్చవద్దని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం కశింకోటలో కరపత్రాలను పంపిణీ చేశారు. స్మార్టు మీటర్ల వల్ల కలిగే నష్టాలను జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు విద్యార్థులకు వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అదానీ గ్రూపునకు లాభాలు దోచి పెట్టడానికి, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా ప్రజల నుంచి ఆదాయాలను గుంజుకోవడానికి స్మార్టు మీటర్లు ఏర్పాటు చేస్తున్నారని విమర్శించారు. దీనివల్ల తక్కువ విద్యుత్ వాడే వారికి భారీ విద్యుత్ చార్జీలతో చుక్కలు చూపుతారన్నారు. 300 యూనిట్లు దాటి వినియోగించే వినియోగదారులకు తల్లికి వందనం వంటి సంక్షేమ పథకాలు లేకుండా చేస్తారన్నారు. దీనిదృష్ట్యా స్మార్టు మీటర్లు బిగించకుండా ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలన్నారు.

వీధి కుక్క దాడిలో ఇద్దరికి గాయాలు



వీధి కుక్క దాడిలో రమణమ్మ చేతిపై గాయం



వీధి కుక్క దాడిలో గాయపడ్డ వెంకటరావు

పరవాడ: మండలంలోని నాయుడుపాలెంలో వీధి కుక్కల దాడిలో గ్రామానికి చెందిన కూండ్రపు రమణమ్మ, కూండ్రపు వెంకటరావు తీవ్రంగా గాయపడ్డారు. వీధిలో సంచరిస్తున్న వీధి కుక్క వీరిపై గురువారం దాడికి పాల్పడి చేతులపై తీవ్రంగా గాయపర్చింది. క్షతగాత్రులకు వాడచీపురుపల్లి పీహెచ్‌సీ సిబ్బంది వైద్య సేవలు అందించారు. రోజురోజుకూ పెరిగిపోతున్న వీధి కుక్కల నియంత్రణకు పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడాలి



మాట్లాడుతున్న విశ్రాంత ఉపాధ్యాయుడు డాక్టర్ రాజశేఖర్

మునగపాక: ప్రతి ఒక్కరూ హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడాలని గురుకుల పాఠశాల విశ్రాంత ఉపాధ్యాయుడు డాక్టర్ రాజశేఖర్ కోరారు. మునగపాక అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం రాత్రి విశ్వహిందూ పరిషత్ మండల శాఖ అధ్యక్షుడు శరగడం పరదేశినాయుడు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ భగవద్గీత పారాయణం చేసుకోవాలన్నారు.

రెండో రోజూ క్వారీ బాధితుల నిరాహార దీక్షలు



నిరాహారదీక్ష చేస్తున్న క్వారీ బాధితులు, ప్రజాసంఘాల నాయకులు

నర్సీపట్నం : మాకవరపాలెం మండలం, జి.కోడూరు సర్వే నెంబరు 332లో కొనసాగుతున్న నల్లరాయి క్వారీని రద్దు చేయాలంటూ దళిత రైతులు, ప్రజాసంఘాలు ఆర్డీవో కార్యాలయం వద్ద చేపట్టిన నిరాహారదీక్షలు గురువారం నాటికి రెండో రోజుకు చేరాయి. వైఎస్సార్‌సీపీ మండల యూత్ అధ్యక్షుడు మట్ల చంటిబాబు, ఆలిండియా బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బొట్టా నాగరాజు, ఓబీసీ జిల్లా నాయకులు బొంతు రమణ, సామాజిక కార్యకర్త కె.శివనారాయణరాజు, కె.వి.పి.ఎస్ నాయకులు చిరంజీవి మాట్లాడుతూ క్వారీ నిర్వహణ వల్ల ప్రజల ప్రాణాలకు ముప్పు పొంచి ఉన్నందున తక్షణమే అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. క్వారీ అనుమతులు మంజూరులో పర్యావరణ నిబంధనలు ఉల్లంఘించారన్నారు. భవిష్యత్తులో కూడా క్వారీ నిర్వహణకు అనుమతులు ఇవ్వబోమని హామీ ఇవ్వాలన్నారు. అనుమతులు రద్దు చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. దీక్షల్లో బాధిత సాగుదారుల సంఘం నాయకులు అప్పారావు, లోవరాజు, పెంటయ్య, గణేష్, సతీష్, రమణ పాల్గొన్నారు.

నాసిరకం విత్తనాలతో మోసపోయిన సర్పంచ్

- రైతు సేవా కేంద్రంలో మూడు బస్తాల విత్తనాలు కొనుగోలు
- 15 రోజులు దాటినా మొలకెత్తకపోవడంపై ఆవేదన



కేపీ అగ్రహారంలో సరిగా మొలకెత్తని సర్పంచ్ ఆకుమడి



సర్పంచ్ కొనుగోలు చేసిన ఆర్‌జీఎల్ రకం వరి ధాన్యం గోనెలు

బుచ్చెయ్యపేట : నాసిరకం వరి విత్తనాలతో పలువురు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కేపీ అగ్రహారం సర్పంచ్ గోపిశెట్టి శ్రీను తన గ్రామ రైతు సేవా కేంద్రంలో ఆర్‌జీఎల్ 2537 రకం మూడు బస్తాల వరి విత్తనాలను 20 రోజుల కిందట రూ.3వేలకు కొనుగోలు చేశాడు. తన పొలంలో దమ్ము చేసి వరి విత్తనాలు వేశారు. విత్తనాలు వేసి 15 రోజులు దాటిన వరి విత్తనాలు సరిగా నాటలేదు. మూడు బస్తాలు వేయగా ఒక బస్తాకి తగ్గ ఆకు మాత్రమే నాటిందని వాపోయారు. నాసిరకం వరి విత్తనాలను ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల ద్వారా సరఫరా చేశారని వాపోయారు. ప్రభుత్వం సరఫరా చేసిన వరి విత్తనాల బస్తాలను రైతు సేవా కేంద్రంలో వ్యవసాయశాఖ సిబ్బంది మొలక శాతంను పరీక్షించకుండా నేరుగా రైతులకు అమ్మకాలు చేశారన్నారు. ఇప్పటికే వర్షాలు సరిగా లేక వరి ఆకుపోతలు ఆలస్యంగా వేశామని ఇపుడు నాసిరకం వరి విత్తనాల వల్ల వరి ఆకు నాటక తీవ్రంగా నష్టపోయానన్నారు. ఏడాది తిండి గింజలు ఆరంభంలోనే దక్కని పరిస్థితి ఏర్పడిందన్నారు. నాలాగే మా గ్రామంలో రైతుల ఆకుమడులు సరిగా నాటడం లేదని ప్రభుత్వం నాసిరకం విత్తనాలు సరఫరా చేసిన వారిపై చర్యలు తీసుకుని నష్ట పరిహారం అందించాలని కోరారు.

రోడ్డు మధ్య గోతులను పూడ్చిన పోలీసులు



దిబ్బిడి వద్ద రోడ్డు గోతులను కప్పిస్తున్న పోలీసులు

బుచ్చెయ్యపేట మండలంలో కశింకోట,బంగారుమెట్ట రోడ్డులో రోడ్డు మధ్యన ఏర్పడ్డ గోతులను పోలీసులు కప్పించారు. కేబీ రోడ్డులో దిబ్బిడి వైస్ ఎంపీపీ గొంపా చినబాబు ఇంటి వద్ద రోడ్డు మధ్యలో పెద్ద గొయ్యి ఏర్పడింది. వేగంగా వస్తున్న పలువురు వాహనదారులు ఈ గోతిలో పడి ప్రమాదాలకు గురౌవుతున్నారు. గురువారం సాయంత్రం ఎస్ఐ శ్రీనివాసరావు, అదనపు ఎస్ఐ భాస్కరరావు చొరవ చూపి కేబీ రోడ్డులో ఏర్పడ్డ గోతులను పిక్క,రాయి బుగ్గితో కప్పించారు.